


**కదిలిన బస్సు ఉన్నట్టుండి ఆగింది — ఎవరో బస్సు తలుపు తడుతున్న శబ్దం. ఆగిన బస్సులోకి తొందర తొందరగా ఎక్కారు** ఎవరో...

ఆలస్యంగా రావటం అంటే ఎంత ఇబ్బందో - ప్రయాణీకులకే కాదు, బస్సు సిబ్బందికినూ !

డ్రైవర్ ముఖంలో, కండక్టర్ ముఖంలో చిరాకు - అణచుకొనేయత్నం చేస్తూ కూడా అనేశాడు కండక్టర్, ''అరగంట ముందు రావాలి సార్! ఆఖరి క్షణాల్లోవస్తే...బస్సు తప్పి పోయేదిగదా?''అని

ఆ అగంతకుడు ఏమీ అనలేదు.

అతను ఏమైనా అంటే బాగుండేది అనుకొన్నాను. దానికి కారణం కండక్టర్ ఆ మాటకు ఇంకొక మాట బదులు అనేవాడు కొంచెం సేపు కాలక్షేపం.

కానీ అలా జరగలేదు.

మళ్ళీ బస్సు కదిలింది.

పైన లగేజీసర్దుకుంటూ ఆ అగంతకుడు.

...అరె, అతను సూర్యారావా?

సరిగా చూసే ప్రయత్నం చేశాను కానీ ముందున ఉన్న అతని ముఖం కనపడలేదు. ఒకటే ఒక్క క్షణం కనపడ్డ అతను సూర్యారావేనా? కాదా?...

బస్‌లో లైటు ఆరిపోయింది.

నా కొచ్చిన సమస్య, సందేహం అలాగే ఉండిపోయింది- అతను సూర్యారావేనా, కాదా?

ఏమో !

సూర్యారావు నాకు ఒకప్పుడు మంచి స్నేహితుడు ఇద్దరం ఒకే ఆఫీసులో పని చేసే వాళ్ళం. రోజంతా నేను ఆఫీసు పని చేసుకొనే వాణ్ని. సూర్యారావు పొద్దున్న రాగానే ముందో అరగంట పేపరు చదివే వాడు. ఆ తర్వాత అరగంట ఆనాటి వార్తల మీద వ్యాఖ్యానం చేసేవాడు. ఆ వ్యాఖ్యానాలు మాత్రం నిజంగా బాగుండేవి. రాజకీయాల లోతు తెలీని నాలాటి వాళ్ళకు అవి మంచి పాఠంలా పని చేసేవి. అప్పటికి పదకొండు న్నరో, పన్నెండో అయేది. ఆ తర్వాత లంచ్ - ఆ తర్వాత ఏదో పుస్తకం పట్టు కొని కూర్చునేవాడు.

అతను పనిచేయగా దాదాపు నేనెప్పుడూ చూడలేదు.

అయినా అతనికీ నాకూ ఒకటో తారీఖున మాత్రం అయిదారు రూపాయల తేడాతో సమంగానే వచ్చేది. ఒక్కోసారి నాకే తక్కువ వచ్చేది. ఇంట్లో జనాభా పెరగటంతో బాటుగా జీతం పెరిగేది కాదు గనుక!!

ఎప్పుడన్నా సూర్యారావును చూసి అసూయ కూడా పడేవాణ్ని!

ఇలా ఒక సంవత్సరం గడిచింది కాబోలు ఉన్నట్టుండి ఓ రోజు పొద్దున్నే అన్నాడు సూర్యారావు "నేను ఈ రోజు రిజైన్ చేసేస్తున్నా!" అని.

ఉలికి పడ్డాను

నా కలలోనైనా ఊహించుకోలేని రాజీనామా సూర్యారావు ఈ రోజు ఇంత ఉన్నట్టుండి నిర్ణయించుకోవటం, అమలులో పెట్టేయటం నాకు ఆశ్చర్యంగా ఉంది.

కారణం అడిగాను. సూర్యారావు ఒక గంటసేపు ఏదేదో చెప్పాడు. ఈ సమాజం అంతా ఎత్తు పల్లాలతో ఉందిట. దేశం ఇలా కొండలు లోయలుగా అంతరాల మధ్య ఉండి పోవటం ప్రకృతికి విరుద్ధమట ఎవరో కొందరు వ్యక్తులు మిగతా అందర్నీ ఇలా దోచుకు తినేస్తుంటే అందరూ అలా చూస్తూ ఊరుకొండిపోవటం అన్యాయమట. అందుకే తన రాజీనామాట!

నాకు నవ్వొచ్చింది-దేశంలో అంతరాలు ఉన్నాయి. సమాజంలో ఎత్తుపల్లా లున్నాయి నిజమే. కానీ అందుకు సూర్యా రావు ఏం చేస్తాడు? అడిగాను.

"పది మందినీ ఉత్తేజపర్చి..."

"ఎలా?"

"వాళ్ళకు సమాజంలో జరిగే అన్యాయం చెబుతాను".

"ఎలా?"

"కథలు రాస్తాను, పద్యాలు రాస్తాను, పదాలు పాడతాను, గేయాలు రాస్తాను, కవిత అల్లుతాను, జనం మధ్యకు పోయి..."

సూర్యారావు పిచ్చివాడు! జనం సంగతి అతనికి సరిగా తెలీదు. విన్నంతసేపూ విని, ఆ తర్వాత కండువా దులుపుకొని వెళ్ళిపోయే జనం గురించి సూర్యారావు ఇలా ఆలోచించటం ... ఏమో, వెర్రి వేయి రకాలుట!

సూర్యారావు రాజీనామా చేసేసాడు.

ఆ తర్వాత అతని గురించి ఆఫీసులో రకరకాలుగా అనుకొనేవారు. ఎక్కడికో వెళ్ళిపోయాడనీ, కొండల మధ్య బతుకు తున్నాడనీ, ఆఖరికి అతన్ని పోలీసులు కాల్చేశారనీ ... ఎన్నో రకాల వార్తలు వినబడేవి!

నాకు ఒక్కోసారి ఆశ్చర్యం వేసేది, ఒక్కోసారి నవ్వొచ్చేది, ఒక్కోసారి జాలి కలిగేది-

ఆఖరికి ఈ రోజు ... కాపీ ఇతను సూర్యారావేనా?

ఏమో!

మళ్ళీ లైటు వేసినపుడు చూడాలి!

అతనే అయితే, ఏం చేస్తున్నాడో? బహుశా ప్రజలకోసం ఏమో!

ఆవలింతలు ఆవలిస్తోంటే, మా గన్నుగా నిద్ర వస్తుంటే అలాగే సీటుకు అనుకొని...

టైం ఎంత గడిచిందో ఏమో! ఉన్నట్టుండి మెలుకువ వచ్చింది. చుట్టూ దీపాల వెలుగు.

బస్సు దిగాను, టీ తాగుదామని.

అక్కడ, ఆ వ్యక్తి, అప్పటికే దిగి ఉన్నాడు కాబోలు, సామాను పక్కనే నిలబడి ఉన్నాడు.

సూర్యారావేనా అనే సందేహంతో ముందుకు నడిచాను ఆ మసక వెలుతురులో అవును, సూర్యారావే!

అతనూ నన్ను గుర్తుపట్టాడు "అరె, మీరు ... ఇక్కడ...!"

"అవును. బాగున్నారా?"

సూర్యారావు నవ్వాడు.

కండక్టర్ బస్ కదులుతోందన్నట్లుగా బెల్ కొడుతున్నాడు.

"ఏం చేస్తున్నారు, ఆ ఉద్యోగమేనా"?

"ఆ, మీరు?" అనడిగాను.

జేబులోంచి విజిటింగ్ కార్డు తీసి ఇచ్చాడు, ఆ మసక వెలుతురులో చదివే ప్రయత్నం చేశాను "సూర్యం, సంపాదకుడు, వెన్నెల, మాసపత్రిక" అని ఉంది.

'వెన్నెల' అంటే ఆ సెక్సు పత్రిక?... దాని కోసం మా ఆఫీసులో ఉండే లైబ్రరీలో కళ్ళు కాయలుగా చూసేవాళ్ళు ఎందరు గుర్తొచ్చారో నాకు ఆ క్షణంలో...

"అంటే?"

"నేనే, ఆ సూర్యాన్ని."

కండక్టర్ బెల్ కొడుతూనే ఉన్నాడు.

అడుగు ముందుకు వేస్తూ అడిగాను "అంటే, మీ ఆశయాలూ వగైరా?"

"జనం సంగతి మీకు చెప్పాలా? వాళ్ళ బలహీనత..." ఏదో అంటున్నాడు బస్ కదులుతోంటే ఎక్కేసాను.

సూర్యం ... సూర్యారావు! జనం... బలహీనత సెక్సు పత్రిక ...విప్లవకారుడు... నవ్వొచ్చింది!

బస్సు ముందుకు పోతోంది. డ్రైవర్ లైటు ఆర్పేశాడు.

చుట్టూ చీకటి. మా బస్సు మాత్రం పెద్ద పెద్ద దీపాల కళ్ళతో ప్రయాణం చేస్తోంది.

నిజమే చుట్టూ చీకటిగా ఉన్నప్పుడు మనం మాత్రమే మనం ఒక్కళ్ళమే ముందుకు పోతోంటే ఎంత బాగుంటుంది?!

సూర్యారావు చేసిన పనిలో నాకు తప్పు కనిపించలేదు. అతను జనంకన్నా ఒక్కడుగు ముందున్నాడు. జనం బలహీనత అతనికి తెలుసు కాబట్టి...

చందాదారులుగా
చేరండి